క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. గవిచర్ల ఫీడర్‌లోని గొల్లవాడ, శివాలయం, ద్వారకా అపార్ట్‌మెంట్, ఆర్టీఓ కార్యాలయం, నాయుడు పెట్రోల్ పంపు, ఉర్సు 11 కేవీ ఫీడర్‌లోని చెట్లల్లగడ్డ, కామునిపెంట, ఉర్సు బొడ్రాయి, జన్మభూమి కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐటీఐలో వాక్-ఇన్ అడ్మిషన్లు

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ), అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి మిగులు సీట్ల కోసం వాక్ ఇన్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. అడ్మిషన్ల కోసం ఈ నెల 6 నుంచి 28 వరకు మిగిలిపోయిన సీట్లలో అవకాశం కల్పిస్తారు. 10వ తరగతి పాసై ఉండాలి. కనీస వయస్సు 14 సంవత్సరాలు (01-08-2025 నాటి ప్రధాన మార్గదర్శకాలు). వాక్-ఇన్ ద్వారా ప్రవేశం పొందాలంటే ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి. వెబ్‌సైట్ iti.telangana.gov.inమొదటి, రెండో దశలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. కొత్తవారు మాత్రం నేరుగా కాజీపేట ఐటీఐ కేంద్రానికి వచ్చి ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్లు పొందవచ్చు. ఏటీసీ కోర్సుల్లో అడ్మిషన్లు పొంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత మెరుగుపర్చుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

కాజీపేట అర్బన్ : హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 55, 56 డివిజన్లలోని గోపాల్‌పూర్ ప్రాంతంలో అక్రమంగా అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న దూలం ప్రసాద్, భూపతి మనోహర్‌లపై కేసు నమోదు చేసినట్లు హన్మకొండ ఎక్సైజ్ సీఐ దుర్గాభవానీ మంగళవారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసి 5.67 లీటర్ల మద్యంను స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకన్న చందు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో కాకతీయాస్ టెంపుల్స్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి వర్క్‌షాప్ కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్‌తో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

న్యూశాయంపేట : నగరంలోని హనుమకొండ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల గర్ల్స్-1లో ప్రముఖ గుండెవైద్య నిపుణుడు రామక శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి గౌస్ హైదర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరంలో విద్యార్థులకు గుండె పనితీరు, హార్ట్ స్ట్రోక్ లక్షణాలు, నివారణ చర్యలు, సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరజ, తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న మహాసభ నాయకులు

న్యూశాయంపేట : అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు బాలబోయిన కిషోర్ యాదవ్ తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంగల చెన్నమల్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దేనబోయిన రవియాదవ్, ఉపాధ్యక్షులుగా రాజబోయిన కుమార్‌యాదవ్, గడల రమేష్ యాదవ్, కందుల నర్సయ్య యాదవ్, అబోతు రాజుయాదవ్, కార్యదర్శులుగా సాదం సునిల్, బొల్లబోయిన వీరస్వామి, మాదరబోయిన యాదగిరి, వేల్పుల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం



రామన్నపేట : వరంగల్‌కు చెందిన ఖాజారఫీక్ మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో పోరాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతూ మూడు రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ముస్లిం ఉద్యోగులు తక్షణమే స్పందించి రూ.1.40 లక్షల ఆర్థికసాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు.

బాపూజీనగర్‌లో రోడ్లు అధ్వానం

- గుంతలతో దర్శనమిస్తున్న అంతర్గత రహదారులు
- ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



దెబ్బతిన్న అంబేద్కర్‌నగర్ నుంచి బాపూజీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి



బాపూజీనగర్‌లోని గెత్సెమనే చర్చి వెనకాల దెబ్బతిన్న సర్కిల్ రోడ్డు

కాజీపేట రూరల్ : గ్రేటర్‌లోని 47వ డివిజన్ బాపూజీనగర్‌లో పలు చోట్ల రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. బాపూజీనగర్ మెయిన్‌రోడ్ కడిపికొండ బ్రిడ్జికి ఎదురుగా ఉన్న అంబేడ్కర్ నగర్‌కు వెళ్లే రోడ్డు లైన్ నుంచి డీజిల్‌కాలనీ సెంటర్ వరకు పలు చోట్ల కాలనీలకు వెళ్లే అంతర్గత రోడ్డు మార్గాలు దెబ్బతిని, గుంతలు పడి, కంకర లేచి చూపరులకు అంధవికారంగా దర్శనమిస్తున్నాయి. స్థానిక ప్రభుత్వ పాఠశాల పక్కన నుంచి అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం, పాఠశాల వెనకాల నుంచి వెళ్లే రోడ్డు మార్గం, బాపూజీనగర్ మెయిన్‌రోడ్ నుంచి అంబేడ్కర్‌నగర్, పోచమ్మగుడి కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షాలు పడినప్పుడు రోడ్ల వెంబడి గుంతల్లో వర్షం నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వాహన భాగాలు దెబ్బతిని పాడైపోతున్నాయని చెబుతున్నారు. చాలాసార్లు స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టాలి



బాపూజీనగర్‌లో పలు చోట్ల బెబ్బతిన్న వివిధ కాలనీలకు వెళ్లే రోడ్లను అధికారులు, పాలకులు పట్టించుకోవాలి. గుంతల రోడ్లపై వెళ్లే వాహనదారులు చాలాసార్లు అదుపుతప్పి కిందపడ్డారు. రోడ్లను పట్టించుకొని మరమ్మతులు చేపట్టాలి.

– జి.జయరాజ్

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బాధ్యులు



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

విద్యారణ్యపురి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బాధ్యులు నన్నెబోయిన తిరుపతి, టి.లింగారెడ్డి మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో 5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఆ పోరాట కమిటీ రాష్ట్ర బాధ్యులు డి.కిరణ్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లాల యూఎస్‌పీసీ బాధ్యులు గాడిశాల సత్యనారాయణ, రవీందర్‌రాజు, పెండెం రాజు, కె శ్రీనివాస్, ఉప్పలయ్య, గోవిందరావు, శ్రీరామాంజనేయులు, కుమార్,అశోక్, యాకయ్య, వై ప్రశాంత్, అంజనీదేవి, అన్నాదేవి, సుధారాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు

హన్మకొండ : ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీజీ ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎ.ఆనందం అన్నారు. సోమవారం రాత్రి నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని స్పోర్ట్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, ఆ ర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మాసు బొక్కారావు, కార్యదర్శిగా చుంచు శిరీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శితో పాటు మాజీ కార్యదర్శి దర్శనాల మొగిలయ్యను అసోసియేషన్ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి కుమారస్వామి, ఆర్థిక కార్యదర్శి నర్సింహారావు, హనుమకొండ టౌన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్, రాజ్‌కుమార్, రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నగేశ్, లింగమూర్తి, నాయకులు తిలక్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందంజ

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి



యూనియన్ సభ్యత్వాలను అందజేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి

కాజీపేట/మడికొండ : క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనలో పీఆర్‌టీయూ టీఎస్ ఎప్పుడు ముందంజలోనే ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని మడికొండ సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల శాఖ అధ్యక్షుడు శ్రీదేవిరెడ్డి మాలకొండ రెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు యూనియన్ సభ్యత్వాలను అందజేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగళి శ్రీపాల్ రెడ్డికి ఓటేసి గెల్పించిన ఉపాధ్యాయులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు సంధ్యారాణి, మండల ప్రధాన కార్యదర్శి వీరప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు హున్యా నాయక్, వంశీ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

- బ్రహ్మకుమారీస్ సిస్టర్ శ్రీలత



కేయూలో వీసీ, రిజిస్ట్రార్‌లకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారి శ్రీదేవి

మామునూరు : యోగ, ధ్యానం సాధన చేస్తే విధి నిర్వాహణలో మానసిక ఒత్తిడి దూరమై మనసుకు ప్రశాంతత లభిస్తోందని వరంగల్ బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ శ్రీలత, చరిత సూచించారు. టీజీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ ఆదేశాల మేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగు బెటాలియన్ ప్రాంగణంలో వరంగల్ శివనగర్ బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో టీజీఎస్పీ డీ కంపెనీ పోలీసులకు మానసిక ప్రశాతతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులకు విధి నిర్వాహణలో ఎంతో ఒత్తిడి ఉంటుందన్నారు. అనంతరం టీజీ అధికారులు, సిబ్బందికి బ్రహ్మకుమారీస్ రాఖీలు కట్టి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్సైలు లింగా నాయక్, సుమిత్‌సింగ్,అధికారులు పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్‌కు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డికి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంకు బ్రహ్మకుమారి శ్రీదేవి మంగళవారం యూనివర్సిటీలో రాఖీలు కట్టారు.

గీత కార్మికులు చైతన్యం కావాలి

మడికొండ : గీత కార్మికులు చైతన్యం కావాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ అన్నారు. మంగళవారం 46వ డివిజన్ రాంపూర్ ఔటర్ రింగ్‌రోడ్డు కల్లుగీత కార్మికుల అమరుల యాది సమావేశం నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా తాళ్లపల్లి నర్సయ్య గౌడ్, ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధాకర్‌గౌడ్, వల్లాల గంగాధర్‌గౌడ్, హాజయ్యారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘానికి సేవలు అందించిన కుమారస్వామి, సట్ల సమ్మయ్య గౌడ్, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆగస్టు18 వరకు సర్దార్‌సర్వాయి పాపన్న వారోత్సవాల్లో అమరుల యాది పేరిట గీత కార్మిక చైతన్యయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారుడు కోతి సామరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయ పనులు పూర్తి చేయాలి

ఖిలా వరంగల్ : వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నేత రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఖిలావరంగల్ పెట్రోల్ పంప్ ఏరియాలో బండి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 మండలాలకు చెందిన పేద, సామాన్య ప్రజలు వివిధ పనులపై వరంగల్ నుంచి హనుమకొండకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు, బన్న నర్సింగం, జయబాబు, ఖాన్, భాస్కర్, హరిబాబు, వీరన్న,పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కేయూ వీసీ



మొక్క నాటుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అందుకు ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూలోని అవెన్యూ ప్లాంటేషన్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా యూనివర్సిటీలోని ఆడిటోరియం ప్రాంగణంలో వనమహోత్సవంలో వీసీ, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో కలిసి మొక్కలు నాటారు. ఈ మొక్కలను నాటే కార్యక్రమాన్ని క్యాంపస్‌లో కొన్ని రోజులపాలు పాటు కొనసాగిస్తామని తెలిపారు. కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నారాయణ, అవెన్యూప్లాంటేషన్ ఇన్‌చార్జ్ వెంకటయ్య, వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధిపై చర్చకు సిద్ధం

రామన్నపేట : ఆర్యవైశ్య పట్టణ సంఘం అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని, నీవు ఆర్యవైశ్య సత్రం లెక్కలు చూపెట్టగలవా అంటూ గట్టు మహేష్‌బాబుపై ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు సవాల్ విసిరారు. మంగళవారం వరంగల్ చౌరస్తాలోని పట్టణ ఆర్యవైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైశ్య ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఆర్యవైశ్య సత్రం పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేసింది గట్టుమహేష్‌బాబు కాదా అంటూ ప్రశ్నించారు. మహేష్ బాబు తనపై చేసిన వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తానని స్పష్టం చేశారు. పట్టణ సంఘం ని ధులతో ఆర్య వైశ్య పేదింటి అమ్మాయిలకు ఆర్థికసాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మేయర్‌గా ఉన్న సమయంలో కులమతాలకతీతంగా దేవాలయాలకు, మసీదులకు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన చరిత్ర తనదని తెలిపారు. పట్టణ సంఘం విషయంలో మంత్రి సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు పేర్కొన్నారు.

వడ్డేపల్లిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాజీపేట రూరల్ : కాజీపేట-హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య వడ్డేపల్లి రైల్వే ఆర్వోబీ కింద రైలు పట్టాల పక్కన డ్రెయినేజీ నందు గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం కాజీపేట జీఆర్పీ పోలీసులు గుర్తించారు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి రైల్వే ఆర్వోబీ కింద రైలు పట్టాల పక్కన డ్రెయినేజీలో కాళ్లు, చేతులు ముడుచుకొని గుర్తుతెలియని సుమారు 70 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు మృతి చెంది ఉన్నాడు. చూడడానికి భిక్షాటన చేసే వ్యక్తిగా కనిపిస్తున్నాడు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడు 5.5 ఎత్తుతో, శరీరంపై పసుపురంగు ఫుల్‌షర్టు, బెల్లం రంగు లోయర్ ధరించి ఉన్నాడు. ఎడమచేతిపై పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్, 8712658609, 9440027342 నంబర్లలో సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ కోరారు.

గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి : ప్రజాయుద్ధ నౌక దివంగత గద్దర్ ద్వితీయ వర్ధంతి సభను ఈనెల 6న హనుమకొండలోని హరిత కాకతీయలో మధ్యాహ్నం ఒంటిగంటకు గద్దర్ గళం ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూలో నిర్వహించిన వివిధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, ఇన్నయ్య, రిటైర్డ్ ఆచార్యులు కె వెంకటనారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, కేంద్రసాహిత్య అకాడమి యువ పురస్కార్ గ్రహీత డాక్టర్ రవీందర్, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొంటారని తెలిపారు.

విద్య, వైద్యాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

- ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి

హన్మకొండ : విద్య, వైద్యాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి, ఏఐఎఫ్‌డీఎస్ ప్రధాన కార్యదర్శి గడ్డం నాగర్జున డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండాలని ప్రైవేట్ రంగంలో ఉండకూడదని రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యా వైద్యాన్ని ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వ విద్య వైద్య రంగాలపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పేద ప్రజలకు విద్య వైద్యం ఉచితంగా ఇచ్చేది లేదన్నారు. పేదలకు విద్య వైద్యం అందరికీ అందనిద్రాక్షలా మిగులుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో విద్య వైద్యంతో పాటు సకల వర్గాల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని యువజన విద్యార్థి సంఘాలను వారు కోరారు. ఈనెల 12న హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఏఐఎఫ్‌డీఎస్, ఏఐ ఎ ఫ్ డీవై రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, హనుమకొండ జిల్లా కార్యదర్శి నీల రవీందర్, యువజన విద్యార్థి నాయకులు పరిమళ గోవర్ధన్, ఐతమ్ నగేష్, రాజు, ప్రణయ్, రాజేందర్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

పేదల హక్కుల సాధనకు పోరాడుదాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా

ఖిలా వరంగల్ : పేద ప్రజల హక్కుల సాధనకై మరింత ఉధృతంగా పోరాడుదామని, దీనికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన సమావేశంలో ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం రాక ముందు 1925లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో డిసెంబర్ 26న ప్రారంభమై భారత కమ్యూనిస్టు పార్టీ అనేక కుట్ర కేసులు ఎదుర్కొని, లక్షలాది మంది ప్రాణ త్యాగాలతో, ఎన్నో వీరోచిత పోరాటాలు చేసి స్వాతంత్ర్య పోరాటం భాగస్వామ్యమైన ఘనత సీపీఐ దేనని అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాల పాలన కొనసాగించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో జరుగు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, గుండె బద్రి, ఓర్సు రాజు, ఎండి అక్బర్‌పాషా, యాకాంబర చారీ, జాన్‌పాల్, జన్ను రవి, ల్యాదల్ల శరత్, యాకూబ్ సువర్ణ, మహేష్, యాకూబ్, సువర్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సంధ్య



4కె రన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య

ఎంజీఎం : పుట్టిన ప్రతీ బిడ్డకి తల్లిపాలు అమృతంతో సమానమని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సంధ్య తెలిపారు. మంగళవారం వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, కూరపాటి ఆస్పత్రి సౌజన్యంతో కాకతీయ మెడికల్ కళాశాల 'సేవార్డ్ క్లబ్' ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కేఎంసీ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు నిర్వహించిన 4కె వాకథాన్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగంలో ఎంతో పురోభివృద్ధి సాధించినా శిశువులకు ఈ 'లిక్విడ్ గోల్డ్' (అమ్మ పాలు)ను మించిన పౌష్టికాహారం లేదన్నారు. తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఇతరులకు సహాయపడాలనే మనస్సున్న తల్లులు పాలను 'మిల్క్ బ్యాంక్'లకు అందించాలన్నారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయు)లో నిత్యం ఎంతో మంది శిశువులు ప్రాణాలతో పోరాడుతున్నారని, ఇలాంటి వారికి తల్లిపాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. డాక్టర్ కూరపాటి రాధిక మాట్లాడుతూ తల్లిపాలతో విస్తృత ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వరంగల్ అకాడమీ పీడియాట్రిక్స్ శ్రీరామ్‌రెడ్డి, అశోక్ రెడ్డి, అనిల్, కరుణాకర్, బలరాం నాయక్, డాక్టర్ సుమంత్, కూరపాటి రమేష్, నవీన్,ప్రభాకర్ రెడ్డి, నవదీప్, సేవార్డ్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షురాలు అనన్య, ప్రధాన కార్యదర్శి సాయి సుధాంశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఒకేషనల్ కాలేజీకి ప్రొజెక్టర్, కుర్చీల వితరణ

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీకి డిజిటల్ తరగతుల నిర్వహణకు కాందారి విజయవెంకటేశ్వర్‌రావు-సరస్వతి దంపతులు మంగళవారం కంప్యూటర్ ప్రొజెక్టర్‌ను, 20 కుర్చీలను బహూకరించారు. కాందారి రాజమౌళి జ్ఞాపకార్థం వారి కుమారుడు విజయ్‌కుమార్ అందజేశారు. కంప్యూటర్ ప్రొజెక్టర్‌ను హనుమకొండ జిల్లా డీఐఈఓ ఎ.గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌తో కలిసి కంప్యూటర్ ప్రొజెక్టర్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

హన్మకొండ అర్బన్ : నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ జర్నలిస్టుల కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మంగళవారం కాలనీవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్ఛరణాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇంటింటికీ బీజేపీ

హసన్‌పర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నాసాగర్, జయగిరి, మడిపల్లిల్లో ఈ ప్రోగ్రాం నిర్వహించారు. అన్నాసాగరం ఎంపీటీసీ స్థాన ప్రభారిగా జి.సురేష్‌యాదవ్, మడిపల్లికి చకిలం రాజేశ్వర్‌రావు, జయగిరికి మధుసూదన్‌లను నియమించారు. మండల ప్రభారి రఘునారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

బోధనా పద్ధతులు మార్చుకోవాలి

విద్యారణ్యపురి: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు బోధనా పద్ధతులను మార్చుకోవాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కళాశాలలో ఫ్యాకల్టీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాకల్టీ ఫోరం బాధ్యతలను ప్రాముఖ్యతను అధ్యాపకులు నిర్వర్తించాల్సిన పాత్రను ఆయన తెలియజేశారు.

పింగిళి కళాశాలలో మెగా హెల్త్‌క్యాంపు

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో మంగళవారం కళాశాల హెల్త్‌క్లబ్, వడ్డేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సంయుక్తంగా ఉచిత మెగాహెల్త్ క్యాంప్‌లో విద్యార్థినులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, హెల్త్‌క్లబ్ కన్వీనర్ డాక్టర్ పి.సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్‌ను క్లియర్ చేయండి

హన్మకొండ చౌరస్తా : సాంకేతిక, ఇతర కారణాలతో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను క్లియర్ చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వినోదను శ్రమశక్తి అవార్డు గ్రహీతలు తాటి సత్యనారాయణ, కుసుమ శ్యామ్‌సుందర్ కోరారు. నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన ప్రయోజనాలను సత్వరమే అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పంట క్షేత్రాల సందర్శన



పంట క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

హసన్‌పర్తి : మండలంలోని సీతంపేట గ్రామంలోని పత్తి, వరి, కంది పంట క్షేత్రాలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం సందర్శించింది. ఇందులో భాగంగా పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు మోనోక్రోటోపస్, ఆసిఫేట్ పురుగుల మందులు పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటలో మొగిపురుగు ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకై కార్బొఫిర్యాన్ 3జీ గుళికలు వేయాలని చెప్పారు. అలాగే వరి, పత్తి, ఇతర పంటల్లో నానో యూరియా13:0:45.19:19:19 మందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.